క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఇటీవల మృతిచెందిన చింతకాని గ్రామానికి చెందిన మోతవరపు మధుసూదన్ కుటుంబానికి వీవీసీ ట్రస్ట్ ద్వారా సోమవారం ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (వీవీసీ రాజా) సూచనల మేరకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలు, దేశంలోని రైతులకు నల్ల చట్టాలు తీసుకొచ్చి కనీసం గిట్టుబాటు ధర లేకుండా చేస్తోందని, వీటిని నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బచ్చోడులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. తిమ్మిడి హనుమంతరావు, అంగిరేకుల నరసయ్య, గొర్రెపాటి రమేశ్, మల్లేశ్, ఎన్నెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మంరూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల ఈ నెల 16న నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు కోరారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో సోమవారం ఆయన సమ్మె వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో రైతాంగ, కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు పి.సంగయ్య, వి.సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, ఎ.శ్రీనివాసరావు, ఆర్. యాదగిరి, పుల్లయ్య పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కూసుమంచి: మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరిగే మూడు విప్లవ పార్టీల యూనిటీ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు రేపాకుల శివలింగం పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా విప్లవకారులు ఐక్యం కావాల్సి ఉందన్నారు. సమావేశంలో పోటు నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, సత్యనారాయణ, వీరభద్రం, రోషయ్య, మైసయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

నేలకొండపల్లి: రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం పాటుపడుతున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఎకరానికి రూ.6 వేలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీతారాములు, మన్నె రాధాకృష్ణ, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, వీరబాబు, రామకృష్ణ, రమణ, ప్రసాద్, మీరా, వీరునాయక్, రామకృష్ణచారి పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ట్రూలవర్
వినోద	అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
సాయిరాం	యాత్ర-2
ఆదిత్య (కేపీఎస్)	లాల్‌సలామ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హను-మాన్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	3
వంకాయ	30		20
బెండకాయ	50	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	56	చుక్కకూర	3
బోడ కాకర	80		20
బీర	46	తోటకూర	2
దొండ	36		10
పొట్లకాయ	48	గోంగూర	2
చిక్కుడు	50		10
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	60	పుదీన	1
క్యారెట్	30		20
బీన్స్	60	-ఖమ్మం వ్యవసాయం	

మండల కేంద్రం ఎక్కడ?

- ఖమ్మం రూరల్‌లో విచిత్ర పరిస్థితులు
- చెట్టుకొకటి.. పుట్టకొకటి అన్నట్లుగా కార్యాలయాలు
- ఈ ప్రభుత్వమైనా దృష్టి సారించాలని ప్రజల వినతి



ఖమ్మంలో కొనసాగుతున్న ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయం

ఖమ్మంరూరల్: రాష్ట్రంలో ఎక్కడా లేనట్లుగా జిల్లాలోని ఖమ్మం రూరల్ మండల పరిస్థితి ఉంది. ఈ మండలానికి కేంద్రం ఎక్కడ అనే ప్రశ్నకు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఎవరూ సమాధానం చెప్పలేరు. ఏ మండలానికైనా ఒక కేంద్రం ఉంటుంది. కానీ, ఖమ్మం రూరల్‌కు మండల కేంద్రం లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు చెట్టుకొకటి పుట్టకొకటి అన్నట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఏ రెండు కార్యాలయాలకు ఒకేరోజు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ ఇక్కట్లకు ప్రస్తుత ప్రభుత్వమైనా పరిష్కారం మార్గం చూపాలని మండలవాసులు కోరుతున్నారు.

విసిరేసినట్లుగా కార్యాలయాలు..

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఖమ్మం నగరంలో, ఎంపీడీఓ కార్యాలయం జలగం నగర్‌లో, పోలీస్‌స్టేషన్ వరంగల్ క్రాస్‌రోడ్డులో ఏర్పాటయ్యాయి. ఇక డీసీసీబీ బ్రాంచ్ ఖమ్మంలో, ఆంధ్రా బ్యాంక్ బ్రాంచ్ టేకులపల్లిలో, పీహెచ్‌సీ ఎం.వెంకటాయపాలెంలో ఉన్నాయి. దీంతో ప్రజలు ఏ పనులకైనా వెళ్లాలంటే అన్ని కార్యాలయాలు ఒకేచోట లేక గంటల తరబడి తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కార్యాలయాల తరలింపులో పోటాపోటీ వినతులు

ఇదిలా ఉండగా వేర్వేరు చోట్ల ఖమ్మం రూరల్ మండల ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట(ఒకే ఊరికి)కు చేర్చాలని కోరుతూ గతంలో అధికార టీఆర్‌ఎస్, ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సౌకర్యార్థం ఈ పని చేయడం మంచిదే అయినా.. ఇరు పార్టీల నాయకులు ఎవరికి వారే ప్రత్యామ్నాయ మార్గాలు సూచించడంతో అసలు విషయం పక్కదారి పడుతోందనే ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్ నాయకులు ఏదులాపురం పరిధి వరంగల్ క్రాస్‌రోడ్‌లో తరుణీ హాట్‌కు అన్ని కార్యాలయాలను చేర్చాలని కోరారు. ఇక కాంగ్రెస్ నాయకులు మాత్రం పల్లెగూడెం ఏరియాకు తరలించాలని పట్టుబడుతున్నారు. పల్లెగూడెంకు సమీపంలోనే పోలేపల్లి పరిధిలో 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని పైగా ఇక్కడకు కార్యాలయాలు వస్తే మండల ప్రజలకు సెంటర్ పాయింట్ అవుతుందని కాంగ్రెస్ నాయకుల వాదనగా ఉంది. ఒకవేళ తరుణీ హాట్‌లో ఏర్పాటుచేస్తే ఎప్పటికైనా కార్పొరేషన్‌లో విలీనమైతే.. మళ్లీ అక్కడి నుంచి తరలించాల్సిన పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. కొందరు కావాలనే తమ రియల్ వ్యాపారాన్ని పెంచుకునేందుకు వరంగల్ క్రాస్‌రోడ్‌కు తరలించాలనే వాదన తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. మరోపక్క బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం.. తరుణీ హాట్‌లోనైతే అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే తరుణీహాట్ పక్క పోలీస్ స్టేషన్ ఉండగా.. ఇతర శాఖల కార్యాలయాలకు కావాల్సిన భవనాలు సిద్ధంగా ఉన్నందున ఇదే సరైన స్థానమని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. ఇలా ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా వినతిపత్రాలు ఇవ్వడం, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడంతో అధికారులు ఎటూ తేల్చుకోలేక నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పుడైనా ఏర్పాటయ్యేనా?

ఇదిలా ఉండగా నెలల కిందటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కింది. పొంగులేటికి మండల పరిస్థితులపై పూర్తిగా అవగాహన ఉన్న నేపథ్యాన ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అందరికీ అనువైన ప్రాంతంలో మండల కార్యాలయాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. అలాగే, ఉన్నతాధికారులు సైతం ఈ విషయంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కార్యాలయాల ఏర్పాటుపై ఆలోచన చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

తరుణీహాట్‌కు తరలించాలి

మండల ప్రభుత్వ కార్యాలయాలన్నీ తరుణీ హాట్‌కు తరలించాలి. అక్కడ అన్ని కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడకు కార్యాలయాలను తరలిస్తే ప్రభుత్వ శాఖల సేవలు అందుకోవడం ప్రజలకు సులభంగా మారుతుంది.

–వెంపటి రవి, వరంగల్ క్రాస్‌రోడ్

అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

మండల కార్యాలయాలను తరలించే విషయంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆపై మెజార్టీ ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలి. పల్లెగూడెం ఏరియా మండలానికి సెంటర్‌గా ఉన్నందున ఇక్కడకు కార్యాలయాలు తరలిస్తే మేలు.

–కుమ్మరి అంబేడ్కర్, తల్లంపాడు

సమన్వయంతో పనిచేయాలి



ఎంపీడీఓ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోందని, సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు మాలోత్ ప్రియాంక, ఎంపీపీ భూక్యా గౌరి తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను ప్రస్తావించారు. కుక్కలు, కోతుల సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉందని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ ఆర్.రామకృష్ణను అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుత్తా రవి పాల్గొనగా పలు గ్రామాల ప్రత్యేకాధికారులు హాజరుకాలేదు.

వీవీ.రెడ్డికి 'స్వర సౌరభ' అవార్డు



వీవీ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన గాయకుడు వీవీ రెడ్డికి స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ 'స్వర సౌరభ' బిరుదు ప్రదానం చేసి సత్కరించింది. ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ ప్రతినిధులు వీవీ రెడ్డి ఆయన సతీమణి విజయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో స్వరసుధ గౌరవ అధ్యక్షుడు పారుపల్లి సురేశ్, అధ్యక్షులు కొమర్రాజు మాధవరావు, సలహాదారులు డాక్టర్ వనం కృష్ణవేణి, వినయ్‌కుమార్, ఊటుకూరి శ్రీనివాసరావు, పోతుగంటి వెంకటేశ్వర్లు, నంద్యాల రవి, మొగిలి గుణాకర్, ఐసనపల్లి నగేశ్, మాలతీనాయుడు పాల్గొన్నారు. ఖమ్మం, హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన మాధవరావు, శ్రీనివాసరావు, భారతి, రేవతి, ప్రియాంక తదితరులు వీవీ రెడ్డిని అభినందించారు.

ప్రజాకవి వీరబాబుకు అవార్డు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రజాకవి చిలకబత్తిని వీరబాబుకు జాతీయ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యాన వివిధ రంగాల్లో సేవలందించిన వారికి అవార్డులు అందించగా, వీరబాబుకు సైతం స్థానం దక్కింది. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి మధుసూదన్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆయనను సోమవారం నేలకొండపల్లిలో బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేశ్, జెర్రిపోతుల సత్యనారాయణ, అంజిని, పోలంపల్లి నాగేశ్వరరావు, ఉపేందర్ తదితరులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన బి.శంకర్ (28) సోమవారం రాత్రి ఇంట్లో పురుగులమందు తాగాడు. స్థానికులు గమనించి తొలుత స్థానిక పీహెచ్‌సీకి తరలించాక మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు టాలెంట్ టెస్టులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, నాయకులు

కూసుమంచి: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జిల్లావ్యాప్తంగా టాలెంట్ టెస్టులను నిర్వహించనుండగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు పునుకుల సుధాకర్ కోరారు. సోమవారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీరస్వామిచే టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లావ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నామని, ఈ పరీక్ష రాయడం వల్ల విద్యార్థుల్లో భయాందోళనలు తొలగి మంచి మార్కులు సాధించే వీలుంటుందన్నారు. హెచ్‌ఎం వీరస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించటం అభినందనీయమని, ఈ పరీక్ష వారికి ఉత్తమ మార్కులు సాధించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మౌలానా, వెంకట్, హరీశ్ పాల్గొన్నారు.

15 నాటికి 'గృహజ్యోతి' వివరాల నమోదు



వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

నేలకొండపల్లి: ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం అమలుచేయనున్న గృహజ్యోతి పథకానికి కావాల్సిన వివరాలను శరవేగంగా సేకరిస్తున్నట్లు డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో సర్వేను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు.. ఖమ్మం డివిజన్‌లో ఇప్పటి వరకు 51 వేల మంది వివరాలు నమోదు చేయగా.. ఈనెల 15 లోపు నాటికి వంద శాతం పూర్తి చేయాలని కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కాగా, తమ సిబ్బందికి వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లు అందించాలని కోరారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారు కూడా ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. ఆయన వెంట నేలకొండపల్లి ఏఈ కె.రామారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం మంచుకొండలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు (లోకల్ కోర్టు) నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ కె.తిరుమల్‌రావు, ఏడీ సంజయ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, లోపాలు ఉన్న మీటర్ల మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ తదితర అంశాలపై సదస్సులో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో జరిగే సదస్సును వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు.

మందకృష్ణ మాదిగను కలిసిన జీవీ

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మానికి చెందిన డాక్టర్ జీవీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను హైదరాబాద్‌లో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఖమ్మం అభ్యర్థిగా బరిలో దిగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మద్దతు ఇవ్వాలని కోరగా, మంద కృష్ణ సానుకూలంగా స్పందించారు.

క్రికెట్ టోర్నీలో విజేత 'ఖమ్మం డాక్టర్స్'



విజేతగా నిలిచిన ఖమ్మం డాక్టర్స్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని పటేల్ స్టేడియంలో ఫార్మా కంపెనీ ఆధ్వర్యాన నిర్వహించిన నాలుగు జిల్లాలస్థాయి డాక్టర్స్ క్రికెట్ టోర్నీలో ఖమ్మం డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ జట్టు విజేతగా నిలిచింది. ఖమ్మం, వరంగల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో మిర్యాలగూడ జట్టుపై ఖమ్మం జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు ఖమ్మం ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణ, కూరపాటి ప్రదీప్‌కుమార్‌తో పాటు జగదీశ్, నరేశ్, సంతోష్, సురేశ్, ఓలేటి సాంబమూర్తి ట్రోఫీ అందజేశారు.

ఎస్‌బీఐటీ విద్యార్థులు 51 మంది ఎంపిక



ఎంపికైన వారితో ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: ప్రముఖ కంపెనీలు టీవీఎస్, సుందరం ఆధ్వర్యంలో తమ కళాశాలలో ఆపరేటింగ్ ఇంజనీర్ ట్రెయినీ ఉద్యోగాలకు నిర్వహించిన ప్లేస్‌మెంట్లలో 51 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.40 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో 'శ్రీచైతన్య' డ్రైవ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో సోమవారం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ మమత ఆస్పత్రిరోడ్‌లోని శ్రీ చైతన్య ఒలింపియాడ్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ టీఎల్‌ఎన్ శర్మ పాల్గొని పీజీ విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించామని, అర్హులైన వారిని తమ కళాశాలలో ఉపాధ్యాయులుగా నియమించుకుంటామని చెప్పారు.

విద్యాశాఖ కమిషనర్‌కు వినతి



దేవసేనకు వినతిపత్రం ఇస్తున్న మధు, తదితరులు

ఖమ్మంసహకారనగర్: అఖిల భారత సైనిక్ స్కూల్‌లో ప్రవేశం లభించిన విద్యార్థుల ఫీజు మొత్తాన్ని పాఠశాల విద్యాశాఖ భరించేలా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు సోమవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు వినతిపత్రం అందజేశారు. అలాగే, 11 జిల్లాల్లో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఒక్కో విద్యార్థికి రూ.1.50 లక్షల ఫీజు చెల్లించేందుకు కమిషనర్ హామీ ఇచ్చారని మధు తెలిపారు. నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, కట్టా శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి



నిరసనలో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, తక్షణమే బడ్జెట్ కేటాయింపులను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఆజాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని బైపాస్‌రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,389 కోట్లు కేటాయించడం నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు కాకుండా తక్కువ కేటాయించడంతో ప్రభుత్వ వైఖరి విద్యారంగానికి వ్యతిరేకంగా ఉంటుందనే సంకేతాలు వస్తున్నాయని తెలిపారు. ఇకనైనా బడ్జెట్‌ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్, నాయకులు లాల్‌పాషా, ప్రసాద్, శ్రీకాంత్, ప్రవీణ్, సురేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీభవన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌తో ఎన్నికల అధికారులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వాసవీభవన్ అధ్యక్షుడిగా పసుమర్తి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 25న ఎన్నికలు జరగాల్సి ఉండగా, అధ్యక్ష స్థానానికి గెల్లా శ్రీనివాసరావు, పసుమర్తి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలువేశారు. ఇందులో గెల్లా శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ ఉపసంహరించుకోవడంతో పసుమర్తి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీభవన్ ప్రతినిధులు యర్రా నాగేశ్వరరావు, మాటూరి సుబ్రహ్మణ్యం, కొప్పు కృష్ణమూర్తి, రేగూరి హనుమంతరావు, చీకటిమళ్ల నరేశ్, గోపాలకృష్ణ, యెండూరి బ్రహ్మం అభినందించారు.

జాఫర్‌బావి అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఖిల్లా ప్రాంతంలోని జాఫర్ బావి అభివృద్ధి పనులను మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాఫర్ బావి చరిత్రను భావితరాలకు తెలియజేసేలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ ఆలియా షౌకత్ అలీ, ఈఈ కృష్ణాలాల్, డీఈఈ నవ్యజ్యోతి, ఏఈ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నందిని (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థిని చింతకాయల నందిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం పాల్వాయి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించగా నండిని పాల్గొని ప్రతిభ చూపిందిని తెలిపారు. దీంతో సూర్యాపేటలో జరగనున్న సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు బాలికల జట్టును ఎంపిక చేయగా నందినికి స్థానం దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను హెచ్‌ఎంతో పాటు పీఈటీ రాజకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.